క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



అక్షయ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు చెందిన అక్షయ్ మహదేవ్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు అర్హత సాధించాడు. సోమవారం లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు వివరాలు వెల్లడించారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అక్షయ్ విజయవాడలో జరిగిన 44వ ఎన్‌టీపీసీ సీనియర్ రికర్వ్ పోటీల్లో 4వ స్థానం సాధించి సీనియర్ నేషనల్స్‌కు అర్హత సాధించాడని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు వరకు జార్ఖండ్‌లో జరిగే 44వ ఎన్టీపీసీ సీనియర్ రికర్వ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాడని వెల్లడించారు. అక్షయ్‌ను స్కూల్ డైరెక్టర్ చాట్ల రాజేష్, కోచ్ దివ్యప్రకాశ్ అభినందించారు.

ఘనంగా వేద విద్యాలయం వార్షికోత్సవం



వేద విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): విశ్వనాథ స్మారక వేద విద్యాలయం 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేద పండితులచే కృష్ణ యజుర్వేద పారాయణం నిర్వహించారు. వేద విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉత్తీర్ణతాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం బాలాజీ నగర్ వేద పాఠశాలలో ఆదివారం రాత్రి బండాత్మకూరు భానుప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.

బాప్టిస్ట్ చర్చి పునఃప్రతిష్ట



చర్చిని ప్రారంభిస్తున్న రాజశేఖర్

నెల్లూరు(బృందావనం): వెంకటేశ్వరపురం జనార్దనరెడ్డి కాలనీలో రెవరెండ్ కమతందాస్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి పునఃప్రతిష్ఠ ఆరాధన కార్యక్రమం సోమవారం జరిగింది. రెవరెండ్ రాజశేఖర్ దాసరి మందిరాన్ని ప్రతిష్ఠించి వాక్య పరిచర్య నిర్వహించారు. స్థానిక సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు రెవరెండ్ చంద్రలీల, సంఘ కాపరి శ్యామ్ అధ్యక్షతన కార్యక్రమాన్ని జరిపారు. క్రైస్తవ సంఘ నేతలు ఉరంధూరు సురేంద్రబాబు, జీసెస్ టీవీ ఎండీ బర్నాబాసు, స్థానిక పాస్టర్స్ అసోసియేషన్ నేతలు సుదర్శన్‌రాజు, ఇజ్రాయేలు, సురేష్, నతానీయేలు, హిమకర్, విజయసింహ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రోత్సాహకాలు

నెల్లూరు(సెంట్రల్): ఉద్యాన శాఖ ద్వారా సేకరణ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలకు ఆసక్తి గల వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండ్లు, కూరగాయలు, పూలు నిల్వ చేసుకునేందుకు రాయితీ ద్వారా నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 79950 86780 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అధికారులతో మంత్రి సమావేశం

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో గృహ, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడి పలు విషయాలను వివరించారు.

త్వరలోనే రోడ్ల మరమ్మతులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమావేశం నిర్వహించారన్నారు. పనులు చేపట్టేందుకు సుమారు రూ.2 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారన్నారు. త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని వెల్లడించారు.

చీరల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ నగర్‌లో సోమవారం డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్వర్ణదీప చారిటబుల్ ట్రస్ట్‌కు నాయకుడు విజయ్‌కుమార్ రూ.5 వేలు అందించారు.

అలా వదిలేశారు!

- రోడ్లపైనే పశువులు
- ఇక కుక్కలైతే లెక్కలేనన్ని..
- దోమలతో నిత్యం నరకం
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు



మైపాడు రోడ్డులో పశువులు

నెల్లూరు(బారకాసు): నగర ప్రజలపై దోమలు, కుక్కలు, పశువులు ముప్పేట దాడి చేస్తున్నాయి. వీటి బారి నుంచి తప్పించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షాలకు ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. నగరంలో ఏ రోడ్డును చూసినా కుక్కలు అధికంగా దర్శనమిస్తున్నాయి. పశువులు రోడ్లపై కనిపిస్తే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు హెచ్చరికలు చేసినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెట్టడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

➡ నగర ప్రజలు దోమల బారి నుంచి తప్పించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. చీకటి పడిందంటే చాలు తలుపులు, కిటికీలు మూసేయాల్సిన పరిస్థితి వచ్చింది. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో అటు వైద్యారోగ్య శాఖ ఇటు కార్పొరేషన్ అధికారులు విఫలమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

➡ నగరంలో కుక్కలను నియంత్రిస్తామని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా ఉన్నాయి. వాటి బారిన పడి గాయపడిన వారున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికంగా ఉండటంతో అటువైపు వెళ్లేందుకు జనం జంకుతున్న పరిస్థితి ఉంది. ఈ సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

➡ నగరంలోని రోడ్లపై పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాటిని అలా వదిలేయొద్దని అధికారులు యజమానులకు ఆదేశాలు జారీ చేసినా బేఖాతరు చేస్తున్నారు. మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, వీఆర్సీ, స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజారు, చిన్నబజారు, మైపాడుగేట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సత్యనారాయణపురం వీధిలో కుక్కలు

చర్యలు తీసుకోవాలి



ట్రంకు రోడ్డు, వీఆర్సీ సెంటర్, మద్రాసుబస్టాండ్, ఆర్టీసీ ప్రాంతాల్లో ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఎవరు ఎటువైపు వస్తుంటారో తెలియని పరిస్థితి. మరోవైపు రోడ్లపైనే పశువులు తిరుగుతుండటంతో ద్విచక్ర వాహన దారులు భయపడుతున్నారు. ఒక్కసారిగా అడ్డంగా వస్తే ఏం చేయాలో తెలియని పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం

తిరగలేకపోతున్నాం



కుక్కల బెడద అధికంగా ఉండటంతో వీధుల్లో తిరగలేకపోతున్నాం. చిన్నపిల్లల విషయంలో మరింత ఆందోళన పడాల్సి వస్తోంది. రాత్రివేళల్లో ఇళ్లకు వెళ్లే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తోంది. కుక్కలను నియంత్రించే దిశగా నగరపాలక సంస్థ చర్యలు చేపట్టాలి.

– షాజహాన్, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

మాతా, శిశు మరణాలను అరికట్టాలి



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతా, శిశు మరణాలను అరికట్టాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య వైద్యులకు సూచించారు. సోమవారం సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మాతా, శిశు మరణాల సబ్ కమిటీ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో ఐదుగురు శిశువులు మరణించడం బాధాకరమన్నారు. అందుకు కారణాలను సంబంధిత డాక్టర్లను, ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. బీపీ, ఇతర ఆరోగ్య సమస్యలున్న హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల మందులు అందించాలన్నారు. రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. కాన్పులు ఆస్పత్రిలోనే జరిగే విధంగా చూడాలన్నారు. సమావేశంలో పెద్దాస్పత్రి గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ స్వర్ణముఖి, డాక్టర్ భవానీ, జనరల్ మెడిసిన్ డాక్టర్ శోభారాణి, చిన్న పిల్లల డాక్టర్ చందన్‌రెడ్డి, డాక్టర్ దయాకర్, డాక్టర్ శ్రీధర్, డెమో అధికారి కనకరత్నం పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలి. లేకపోతే పోరాటాలు చేస్తాం' అని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. సోమవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్పొరేట్ వ్యక్తులకు దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. అదానీ అక్రమాలు చేశారని, దీనిపై విచారణ చేపట్టాలని, పార్లమెంటరీ జేపీసీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి నాగేంద్రసాయి, నాయకులు షాన్‌వాజ్, వినోదిని, సిరాజ్, మున్నా, తదితరులు, పాల్గొన్నారు.

సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు ఫోన్ ద్వారా సమస్యలను తెలియజేస్తే తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం ఎస్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇందులో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా రోడ్లపై గుంతలను పూడ్చే కార్యక్రమం వేగవంతం చేస్తున్నామన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 150 పశువులను గోశాలకు తరలించామన్నారు. రోడ్లపై పశువులను వదిలేస్తే తప్పనిసరిగా తరలిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 30 వినతులు అందుకున్నామని వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 8, రెవెన్యూ, హౌసింగ్ విభాగం 8, టౌన్ ప్లానింగ్ విభాగం 12, పబ్లిక్ హెల్త్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీలోని అన్ని విభాగాలధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని వావిలేటిపాడులోని ఎంపీపీ పాఠశాలలో నారాయణ చిన్నారి చిరునవ్వు పథకాన్ని సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా టీత్ బ్రషింగ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యశాల డీన్ డాక్టర్ శివకుమార్, డాక్టర్లు అంచల కార్తీక్, సాయికిరణ్, కీర్తన, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

దయ చూపండి సారూ..



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 256 వినతులు



హాజరైన అధికారులు

నెల్లూరు రూరల్: 'సార్ చాలా దూరం నుంచి వచ్చాం. మాపై దయ చూపి వినతులపై తగిన చర్యలు తీసుకోండి' అని ప్రజలు అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం జరిగింది. జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవానీలు సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 256 వినతులు అందాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 130, మున్సిపల్ శాఖ 22, సర్వే 12, పంచాయతీరాజ్ 17, సివిల్ సప్లయిస్ 7 వినతులు తదితరాలున్నాయి. వీటిని గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజాకుమారి, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీటీసీ చందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వాహనం కోసం దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పెద్దాస్పత్రి ఆవరణలో ఉన్న బాల భవిత కేంద్రంలో రోగుల రవాణా కోసం హైరింగ్ (కాంట్రాక్ట్) వాహనం ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 16 వరకు సీట్లు ఉండాలన్నారు. వాహనానికి నెలకు రూ.60 వేలు చెల్లిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు బాల భవిత కేంద్రం మేనేజర్ (ఫోన్ నంబర్ 84669 59902)ను సంప్రదించాలని సూచించారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఫత్తేఖాన్‌పేటలో పెంచలమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె వంట పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెంచలమ్మ కుమార్తె రాజేశ్వరి పుట్టు మూగ. రాజేశ్వరి సైతం వంట పని చేస్తూ తల్లికి చేదోడువాదోడుగా ఉండేది. ఈనెల 8వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. బాధిత తల్లి గాలించినా జాడ తెలియరాకపోవడంతో సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ రైతు బజారు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేయడంతో విద్యుత్ స్తంభాలను మార్చే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమతుల్లేని నిర్మాణాలను తొలగించాలి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల్లేకుండా జరుగుతున్న నిర్మాణాలను, అనధికార కట్టడాలను గుర్తించి తొలగించాలని కమిషనర్ సూర్యతేజ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక బాలాజీ నగర్, మూలాపేట, వాకర్స్ రోడ్డు ప్రాంతాల్లో నిర్మాణాలకు సంబంధించి అనుమతి పత్రాలను కమిషనర్ పరిశీలించారు. ప్లాన్ ప్రకారం నిర్మాణం జరగాలని, నిబంధనలకు విరుద్ధంగా అదనపు నిర్మాణం జరిపితే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. భవన నిర్మాణాలకు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తప్పనిసరి అని, అలా కాకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. అనంతరం ప్రధాన కాలువ పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించారు.

వీఎస్‌వీ పథకాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న అధికారులు



హాజరైన వ్యాపారులు తదితరులు

- అసిస్టెంట్ కమిషనర్ శ్రీధర్

నెల్లూరు సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివాద్ సే విశ్వాస్ (వీఎస్‌వీ) పథకాన్ని వినియోగించుకోవాలని ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ కమిషనర్ వి.శ్రీధర్ సూచించారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద శ్రీసాయి ఫంక్షన్ హాల్లో సోమవారం వ్యాపారస్తులు, సీఏలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను బకాయిలు చెల్లించేందుకు ఈ పథకాన్ని తెచ్చారన్నారు. దీని ద్వారా బకాయి మొత్తాలను చెల్లిస్తే జరిమానాలు ఉండవన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. ముందస్తు చెల్లింపుల ద్వారా వినియోగదారులకు ప్రయోజనం ఉంటుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కె.శరత్‌బాబు, అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పశువులను గోశాలకు తరలిస్తాం

నెల్లూరు(బారకాసు): ప్రధాన రోడ్లపై వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని, వాటిని తప్పనిసరిగా గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్ మోహన్ హెచ్చరించారు. పశువులను గోశాలకు తరలించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా రెండు బృందాలు స్థానిక మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, బీవీనగర్, సంతపేట ప్రాంతాల్లో సంచరిస్తున్న ఐదు పశువులను కల్లూరుపల్లి గోశాలకు సోమవారం తరలించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ వాహన ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అర్ధరాత్రి కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పశువుల సంచారంపై నిఘా ఉంచుతామన్నారు. వాటిని గోశాలకు తరలించి సంరక్షణ బాధ్యతలను నగరపాలక సంస్థ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక పెద్దబజారు జంతు వధశాలను డాక్టర్ సందర్శించి నిబంధనలు పాటించాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. తెల్ల పశువులను వధించకూడదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధుల్లో తిరిగే పందులను వాటి యజమానుల ద్వారా పట్టించి వాటి స్వస్థలాలకు తరలించారు. జనవాసాల మధ్య పందులను వదలకూడదని తెలియజేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టరేట్‌లో వైద్య శిబిరం



షుగర్ పరీక్ష చేయించుకుంటున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల కోసం ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు షుగర్, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. నొప్పులు, ఇతర సమస్యలున్నవారికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పెంచలయ్య మెడికల్ ఆఫీసర్‌లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నాం.. దోచేస్తాం



తవ్వకాలు జరిగిన ప్రాంతం



దెబ్బతిన్న రోడ్డు

- అక్కచెరువుపాడులో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- టీడీపీ నేతల అండదండలు
- వీఆర్వో ఫిర్యాదుతో రెండు ట్రాక్టర్ల సీజ్

నెల్లూరు సిటీ: అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. రూరల్ మండలంలో అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. టీడీపీ పెద్దల అండదండలు పుష్కలంగా ఉండటంతో కొందరు నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్కచెరువుపాడు గ్రామంలో టిడ్కో గృహాలకు సమీపంలో కొందరు టీడీపీ నేతలు 15 రోజులుగా గ్రావెల్ తవ్వకాలు చేశారు. దీంతో రోడ్లు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో స్థానికులు ఈ విషయాన్ని వీఆర్వో రమణయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఐదో నగర పోలీసులకు సమాచారం అందించారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను వారు సీజ్ చేశారు.